"అంటే?" అంది అర్థంకానట్టు.

"మైక్రోఫోన్ అంటే తెలీదా?"

"నాకు ఫోన్ ఎలా పనిచేస్తుందో కూడా తెలీదు."

విహారి ఆమెవేపు కన్నార్పకుండా చూడు. ఆమె నిజం చెబుతూందో, ఇంకా అబద్ధమాడుతుందో అర్థంకాలేదు.

సడెన్‌గా అతడు రిలాక్స్ అయ్యాడు. స్వామి తాలూకు ఒక ముఖ్యమైన రహస్యం బయటపడింది అన్న సంతోషం అది! నవ్వి, "ఫోన్ ఎలా పనిచేస్తుందో తెలియకుండానే ఇంతకాలం నాకు ఫోన్ చేశావా?" అని అడిగాడు వెక్కిరిస్తున్నట్టు.

సునాదమాల మొహం ఎర్రబడింది. "ప్రతిసారీ మీరు తప్పు నా మీదకే తోసేస్తున్నారు. నేనెక్కడికి వెళ్తున్నది వాళ్ళు పట్టుకుంటే అది మీరిచ్చిన తాయెత్తు ద్వారానే.... ఆ విషయం తెలుసుకోకుండా నా మీద అనవసరంగా నేరం మోపారు. అలాగే ఈ ఫోన్‌ల సంగతి కూడా...

మొదట్లో అయితే అబద్ధం చెపుతాననుకోవచ్చు. ఇప్పుడు కూడా ఆ అవసరం ఏముంది? మీ బరువు సంగతి, ఆ తెల్ల చీరెల సంగతి నాకసలు తెలీదు. చెప్పమంటే ఇంకో వందసార్లు ఈ సంగతి చెపుతాను" అంది రోషంగా, అతడామె వైపు కన్నార్పకుండా చూసి---

"నీ కుడిచెయ్యి బొటనవేలు చూపించు" అన్నాడు.

ఆమె ఆశ్చర్యంగా "ఎందుకు?" అంది.

"ముందు చూపించు" చెప్తాను.

ఆమె బొటనవేలు ఎత్తి చూపించింది.

"మైగాడ్ లేదే....." అన్నాడు.

"ఏమిటి లేదు?"

"ఆ రోజుల్లో ఫోన్ చేసినప్పుడు, వేలుమీద మచ్చ వుందని చెప్పావు. పైగా అలా కుడిచేతి బొటనవేలు మీద పుట్టుమచ్చ వున్న ఆడవాళ్ళకి ప్రేమించిన ప్రియుడే మొగుడవుతాడని పుక్కట పురాణం కూడా చెప్పావు."

"ఎడమచేతి బొటనవేలు, కాలివేళ్ళు కూడా చూపించమంటారా?" అమాయకంగా అడిగింది.

అతడు కోపం అణుచుకుని "అవసరంలేదు" అన్నాడు. అన్నాడే గానీ, అతడి మనసంతా కన్ఫ్యూజింగ్‌గా తయారైంది.

* * * *

"లేదు విహారి ఆయన నాకు తండ్రి మాత్రమే కాదు ఫ్రెండ్, ఫిలాసఫర్, గైడ్ - అన్నీ... స్వవిషయంలో ఓడిపోయినా, వృత్తిధర్మంలో ఎదురుదెబ్బలు తిన్నా ఆయనే నాకు ధైర్యం చెప్పేవారు. ఆయన లేని లోటు తీరదు -" విషాదంగా అంది.

ఆమె అంత దిగులుగా మాట్లాడడం అతనెప్పుడూ చూడలేదు. అనునయిస్తున్నట్టు

అతనన్నాడు- "నీ తండ్రి నీకు గైడ్ అయితే నువ్వు నాకు ఇన్‌స్పిరేషన్‌వి ప్రవల్లికా! మామూలుగా నాటకాలు ఆడేవాడిని. ఈ రోజు ఈ శక్తులమీద యుద్ధం ప్రకటించేటంత ధైర్యాన్ని పొందానంటే అది కేవలం నీవల్లే. ఒక్కొక్క మనిషి జీవితబాట మారిపోవడానికి ఒక్కొక్క వ్యక్తి కారణం అవుతూ వుంటారు. ఆ విధంగా నా ధ్యేయం మార్చింది నువ్వు. మనం మన లక్ష్యం సాధిస్తామన్న నమ్మకం నాకుంది. అప్పుడే మొదటి విజయం సాధించాం కూడా, ఈ సమయంలో నువ్విలా కృంగిపోవడం మంచిది కాదు. ప్లీజ్ చీరప్-"

ఆమె పేలవంగా నవ్వింది.

"అవును ఈ సమయంలో ధైర్యం అవసరం. దానికన్నా ముఖ్యంగా.... నీ సాయం నాకు చాలా అవసరం --"

"ఒక సి.బి.ఐ. ఆఫీసర్‌గా నేను నీకు సాయపడలేక పోవచ్చు."

"ఏం? ఎందుకని?"

"ఉద్యోగం నుంచి నేను సస్పెండ్ కాబడ్డాను విహారి...."

అతడు స్థాణువై చూశాడు.

ఆమె జరిగిందంతా వివరంగా చెప్పింది--- "....... ఆనంతానంత స్వామి తానెంత గొప్పవాడో మరోసారి మనకు తెలియజెప్పాడు. A-5 ని మనం దాచి ఉంచిన చోటు తెలియగానే అతని మరణం నిర్ధారణ అయిపోయింది. అది సంభవించక ముందే నా సస్పెన్షన్ ఆర్డర్ టైప్ అయిపోయింది. 'ఫలానా వ్యక్తిని ఫలానాచోట దాచావు. అతడికి సరి అయిన రక్షణ లభించలేదు. అందువల్ల అతడు మరణించాడు. రూల్స్‌కి వ్యతిరేకంగా నువ్వీ పనిచేసినందుకు నిన్ను సస్పెండ్ చేస్తున్నాము--' అన్న సస్పెండ్ ఆర్డర్. A-5 మరణించక ముందే టైప్ చేయించి, నా కిప్పించి- తన సుపీరియారిటీని మరోసారి నిరూపించుకున్నాడు."

విహారి పిడికిళ్ళు బిగుసుకున్నాయి. నిస్సహాయంతో కాదు కోపంతో, కసితో.

ప్రవల్లిక చెబుతోంది. "ఆ దృశ్యం నేను చూడకపోయినా నా కళ్ళముందు కదలాడుతోంది. కాళ్ళు లేక చక్రాల కుర్చీలో నిస్సహాయుడై కూర్చున్న నా తండ్రిని ఆ రామ్‌లాల్ చంపిన విధానం! అదృష్టం బావుండి సునాదమాల తప్పించుకుంది. ప్రత్యక్ష సాక్షులు తప్పించుకున్నా తననేమీ చేయలేరన్న ధీమాతో రామ్‌లాల్ ఆమె వెంట పరుగెత్తలేదు. నా తండ్రిని కూడా పూర్తిగా చంపలేదు. అతడు చావు అనివార్యమని, తప్పదని తెలిసే స్థితి వరకు పొడిచి, పొడిచి. ఆ తరువాత ఆ జీవచ్ఛవాన్ని కుర్చీలో అలాగే వదిలేసి తన పని పూర్తిచేసుకు వెళ్ళిపోయాడు. ఏ న్యాయమూ, సాక్ష్యమూ తనని ఏం చెయ్యలేదని అంత ధీమా అతడికి! అలాంటి ధుర్మార్గుణ్ని ఎన్ని వేల ఉరికంబాల మీద ఎన్ని వేలసార్లు ఉరితీయాలి?" ఆవేశంతో ఆమె అంటున్న మాటలు పూర్తికాలేదు. కారు స్టార్టయిన చప్పుడు వినిపించింది.

ఎప్పుడు వెళ్ళాడో తెలీదు కానీ- విహారి కారు స్టార్ట్‌చేసి అక్కడ నుంచి వేగంగా వెళ్ళిపోయాడు.

*　　　*　　　*　　　*

అతడి రక్తం ఉడికిపోతోంది.

స్టీరింగ్‌ని పట్టుకున్న చేతులు వణుకుతున్నాయి. ఒక రకమైన పిచ్చి తనంలో కారుని అమితమైన వేగంతో పోనివ్వసాగాడు. ఎటు వెళుతున్నాడో తెలీదు. అప్రయత్నంగా అతడి చేతులు స్టీరింగ్‌ని ఆశ్రమంవేపు తిప్పాయి.

స్వామి లేకపోవడంతో పెద్దగా సంచారం లేదు. రోడ్డుకి ఇవతల పక్క ఒక వ్యాను కనబడుతోంది. ఆశ్రమం ద్వారం నుంచి బయటకొచ్చి వ్యానువేపు నడుస్తూ అస్పష్టంగా కనిపించాడొక వ్యక్తి. దూరంనుంచి కూడా ఆ భారీ శరీరం పోలికే తెలుస్తుంది.ఆ వ్యక్తి రామ్‌లాల్.

విహారి చేతులు స్టీరింగ్ చుట్టూ బిగుసుకున్నాయి. శరీరంలో ఒక్కసారిగా రక్తప్రసరణ హెచ్చింది. మరేమీ ఆలోచించలేదు. కారు వేగం పెంచి, సర్రున ఎడమవేపుకి కోశాడు.

*　　　*　　　*　　　*

రామలాల్ చాలా సంతోషంగా వున్నాడు. ఎవర్నయినా చంపినప్పుడు గానీ, దారుణంగా హింసించినప్పుడు గానీ అతడికీ విధమైన సంతృప్తి లభిస్తూ వుంటుంది. ప్రతాపరావు, A-5ల మరణం అతడికి ఇలాంటి సంతృప్తే కలిగించింది. స్వామినుంచి పెద్ద మొత్తంలో లాభించింది కూడా ఆ ఆనందంలో ఇరవై నాలుగు గంటలపాటు ఆపకుండా తాగాడు. ఆ మత్తు ఇంకా వదల్లేదు.

ఒక బూతు పాటను పాడుకుంటూ రోడ్డుమీద కొచ్చాడు.

సరీగ్గా ఆ సమయానికి వెనుక నుంచి వచ్చింది కారు. అతడి మనసు ప్రమాదాన్ని సూచించింది. అతడూ సామాన్యుడేమీ కాదు. తరచు మరణం అంచుల వరకు వెళ్ళి వచ్చినవాడు.

వస్తూన్న కారుని చూసి ఒక్క ఉదుటున రామ్‌లాల్ పక్కకి దూకాడు. అయితే దాన్ని ముందే వూహించినట్టు, కారు నడుపుతున్న వ్యక్తి మరింత ఎడమ పక్కకి తిప్పాడు. పక్కకి దూకిన రామలాల్ ఎవరిదో ఇంటి ప్రహరీ గోడకి కొట్టుకుని అదే వేగంతో ముందుకి తూలాడు. ఈ లోపులో ఫుట్‌పాత్ ఎక్కింది కారు. జేబులోంచి పిస్తోలు తీయడానికి చేసే ప్రయత్నంలో రామలాల్ వెల్లకిలా జారాడు. ఆ జారడంలో మోకాళ్ళ వరకు రోడ్డుమీద, శరీరం పైభాగం ఫుట్‌పాత్ మీదా వుండిపోయిండి.

మొహం పక్కకి తిప్పడానికి కూడా టైము లేనంత వేగంగా వచ్చింది కారు. అప్పుడు వేసింది అతడికి మొదటిసారిగా భయం. స్టీరింగ్ దగ్గిర విహారి కనపడ్డాడు.

వి......హా......రి......!

అతడు లేవబోయాడు. అదే సమయానికి కారు చక్రం అతని కాళ్ళ మీదకు ఎక్కడం, అతడు [illegible] అరవడం ఒకేసారి జరిగాయి.

రామ్‌లాల్ లేవడానికి ప్రయత్నించాడు. కాళ్ళు సహకరించలేదు. దూరంగా వెళ్ళిపోతున్న కారు కనిపించింది. జేబులోంచి పిస్టల్ తీసి ట్రిగ్గర్ నొక్కడానికి ప్రయత్నించాడు. మైకం కమ్ముతున్నట్టు అనిపించింది. తిమ్మిరెక్కిన కాళ్ళ నుంచి బాధ తెలియడం మొదలైంది. అది ప్రారంభం...

అలాగే వెనక్కి వాలిపోయాడు.

*　　　*　　　*　　　*

మళ్ళీ అతడికి స్పృహ వచ్చేసరికి ఆస్పత్రిలో వున్నాడు. చప్పున లేవబోయి, శరీరం సహకరించక పోవడంతో అనుమానం వచ్చి కాళ్ళ వేపు చూసుకున్నాడు.

రెండు కాళ్ళూ ట్రాక్షన్‌లో పెట్టి వున్నాయి. బ్యాండేజితో రెండూ రాగిచెట్టుల్లా వున్నాయి. బోదకాళ్ళు వచ్చిన వాడిలా కనపడ్డాడు. పైన ఇనుపరాడ్స్‌కి రెండు తాళ్ళతో కట్టబడి వున్నాయి కాళ్ళు.

అంత భయంకరాకారుడూ నిస్సహాయంగా పడి వున్నాడు.

వరండాలో డాక్టర్లు మాట్లాడుకుంటున్నది వినిపించింది.

"ఈ రెండు కాళ్ళ ఎముకలూ అతుక్కోవడానికి ఎంతకాలం పడుతుంది డాక్టర్?"

"కేవలం ఎముకలు విరిగితే ఫర్వాలేదు. నరాలు కూడా తెగిపోయాయి. అంప్యూటేట్ చెయ్యాలి!"

"మైగాడ్! అంప్యూటేట్?"

ఇద్దరు డాక్టర్లు మాట్లాడుకుంటూ వరండాలో నుంచి వెళ్ళిపోయారు.

రామలాల్‌కి అర్థంకాలేదు.

అంప్యూటేట్.....

అంటే?

... అతడు అడగటానికి ప్రయత్నించాడు. కానీ ఎవర్ని అడుగుతాడు? ఎవరూ లేరు. అది ప్రభుత్వాసుపత్రో, ప్రైవేట్ నర్సింగ్‌హోమో తెలియటంలేదు. మరో అరగంట వెయిట్ చేశాడు. ఎవరూ రాలేదు. దాన్నిబట్టి చూస్తే ప్రభుత్వాసుపత్రే అని అనిపిస్తోంది. కానీ గది ఖరీదయినదిగా తోస్తోంది. ప్రభుత్వాసుపత్రుల్లో అంత ఖరీదయిన గదులు ఉండవు.

అతడి అనుమానం తీర్చడానికా అన్నట్టు సిస్టర్ లోపలకు వచ్చింది.

"సిస్టర్! నేనెక్కడున్నాను?" అనడిగాడు.

"అమెరికన్ ఆస్పత్రి."

"అదీ సంగతి " అనుకున్నాడు. కానీ అంతలో లక్ష అనుమానాలు... తనని ఇక్కడికి ఎవరు చేర్పించారు? తనకి ఇలా జరిగినట్లు పైలోకానికి పంపించి వుంటారా? బహుశా తెలిసి వుండదు ఈ సంగతి! తెలిసినా మరుక్షణం తను ఈ దేశపు అత్యంత ఖరీదయిన ఆసుపత్రిలో వుండేవాడు కదా! అలా లేదంటే... ఇంకా తన వాళ్ళకి ఈ సంగతి తెలిసి వుండదు!

అతడు జేబులు తడుముకున్నాడు. పిస్టల్ లేదు. కాళ్ళకు బ్యాండేజి కడుతున్నప్పుడు తీసి వుంటారు.

అతడు కళ్ళు మూసుకున్నాడు.

విహారి గుర్తొచ్చి కాళ్ళల్లో రక్తం పాకింది. అతడినెలా చంపాలా అని రకరకాల చిత్రవధల గురించి ఆలోచించాడు.

అతడి గదిలో చప్పుడవటంతో కళ్ళు తెరిచాడు. నర్స్ ఏదో సర్దుతోంది.

అంప్యూటేట్ అంటే ఏమిటి? అనడిగాడు. అంత నిశ్శబ్దంలో అతడి భయంకరమైన గొంతు హఠాత్‌గా వినబడటంతో నర్స్ ఉలిక్కిపడింది. అతడు మళ్ళీ అడిగాడు.

డాక్టర్‌ని పిలుస్తాను అంటూ వెళ్ళబోయింది.

ఆగు కర్కశంగా అన్నాడు అంప్యూటేట్ అంటే ఏమిటి?

నర్సు భయపడుతూ ఏదో చెప్పబోతూ వుండగా గుమ్మము దగ్గర అలికిడయింది. పదిమంది స్టూడెంట్స్ టీచర్‌తో కలిసి బిలబిలమంటూ లోపలికి వచ్చారు. ఈ రోజు అంతర్జాతీయ రోగుల దినం పేషెంట్స్‌ని పరామర్శించటానికి వచ్చాం. పిల్లలూ అంకుల్‌కి విషెస్ చెప్పండి అంది టీచర్ హడావుడిగా కళ్ళజోడు సర్దుకుంటూ.

బెస్టాఫ్‌లక్ అంకుల్ ..... ముక్తకంఠంతో అంటూ పూలు జల్లారు.

మైగాడ్ అలా శవం మీద జల్లినట్లు జల్ల కూడదు పిల్లలూ కాళ్ళ దగ్గర జల్లాలి. ఇప్పుడు శవం గురించి ..... సారీ రోగుల గురించి వివరిస్తాను అరటిపళ్ళు కుళ్ళిపోతే ఏం చేస్తాం?

పారేస్తాం టీచర్.

గుడ్ ..... అలాగే కాళ్ళకి రక్తాన్ని తీసుకెళ్ళే నరాలు తెగిపోతే నరాలు కుళ్ళిపోతాయి వాటిని వెంటనే తీసెయ్యకపోతే ఆ విషం శరీరమంతా పాకుతుంది. అలా కుళ్ళిపోకముందే శరీరభాగాన్ని తీసెయ్యడాన్ని అంప్యూటేట్ అంటారు. ఏమంటారు?

అంప్యూటేట్ పిల్లలు కోరస్‌గా అన్నాడు.

ఆకాశం బద్ధలయినట్టు అనిపించింది రామ్‌లాల్ సన్నగా వణికేడు కళ్ళముందు పొరలు తొలగిపోతున్నట్టు అనిపించింది. అయితే వాటి వెనుక నుంచి బయటపడిన యధార్థం శరీరాన్ని చలదరిచింది. అతడి కళ్ళ ముందు భవిష్యత్తు భయంకరంగా కనబడింది.

ఉట్టి ఎముకే విరిగిందో నరాలు కూడా తెగాయో ఎలా తెలుస్తుంది టీచర్? ఒక స్టూడెంట్ అడిగాడు.

మన శరీరంమీద దెబ్బ తగిలితే అబ్బా అంటాం కదా అంటే అక్కడ రక్తం బాగా ప్రవహిస్తుందన్న మాట అందుకే దెబ్బ తెలుస్తుంది. రక్తం లేనిచోట కొట్టినా స్పర్శ తెలీదు.

రామ్‌లాల్ కాలిమీద విష్ణు సాచి పెట్టి కొట్టాడు. గది గోడలు కదిలేలా అరిచాడు రామ్‌లాల్.

ఇదేమిటి టీచర్ అలా అరుస్తున్నాడు?

అంటే? విరిగిన ఎముకున్న పైన కొట్టావన్నమాట క్రింద కొట్టి చూడు అరవడు.

వద్దు వద్దూ అంటూ అరిచాడు రామ్‌లాల్ నర్సు వాళ్ళని బలవంతంగా బయటకి తీసుకెళ్ళింది గది ఒక్కసారిగా నిశ్శబ్దమైంది నిశ్శబ్దంలో ఒక సన్నటిస్వరం వినిపించింది.

బలవంతమైన సర్పము చలిచీమలచేత చిక్కి చావదే సుమతీ అన్న పద్యం విన్నావా రామ్‌లాల్?

రామ్‌లాల్ అదిరిపడి తల తిప్పాడు. అప్పటి వరకూ తలవైపునే కూర్చుని వున్న ప్రవల్లిక లేచి పక్కన మరో కుర్చీలో వచ్చి కూర్చున్నది ఒక క్షణం ఆగి తాపీగా చెప్పడం ప్రారంభించింది.

నా దగ్గిర నుంచి విహారి బయలుదేరిన విధానం చూస్తేనే నాకు అనుమానం వచ్చి అతడిని ఆపటానికి ప్రయత్నం చేశాను. కానీ అప్పటికే అతడు నీ మీద కారు ఎక్కించేశాడు. అదృష్టవశాత్తు సాక్షులెవరూ లేరు. స్పృహ తప్పిన నిన్ను తీసుకొచ్చి ఆస్పత్రిలో జాయిన్ చేశాను. అప్పుడు తెలిసింది నీ కాళ్ళు రెండూ అంప్యూటేట్ చేయక తప్పదని దేముడున్నాడు కదా అనుకున్నాను! నీకు దేముడి మీద నమ్మకం వుండి వుండదులే లేకపోతే యింత కిరాతకుడిగా ఎందుకు మారతావు? నీ వాళ్ళు పోవడం సంగతి తెలియగానే నేను అది కూడా అనుకున్నాను నీకి విషయం డాక్టర్ల ద్వారా తెలియడం కన్న మరింత నాటకీయంగా తెలియటం బావుంటుందని నేనే అంతర్జాతీయ రోగుల దినాన్ని ఏర్పాటు చేసి పిల్లలద్వారా ఈ విషయం చెప్పించాను. ఆ పిల్లల్ని గుర్తుపట్టావా రామ్‌లాల్? వాళ్ళలో ఒక ముక్కు పచ్చలారని వాడిని..... వాడి పుట్టిన రోజునాడు నిర్ధాక్షిణ్యంగా కాల్చిచంపారు మీరు తమ స్నేహితుడి మరణాన్ని ఆ పిల్లలాందరూ జటాయువుల్లా నిలబడి చూశారు. ఈ రోజు నేను చిన్న సైగ చేసివుంటే వాళ్ళు నిన్ను ఖండఖండాలుగా నరికి వుండే వారు. కానీ నువ్వంత సులభంగా చావటానికి వీల్లేదు రామ్‌లాల్ నా తండ్రి కాళ్ళు నరికావు. నా అన్నా వదినల్నీ చంపావు. నువ్వు కుళ్ళి కుళ్ళి చావాలి ఒకప్పుడు నాకు ఈ న్యాయ వ్యవస్థ మీద గొప్ప గౌరవముండేది రామ్‌లాల్! ఉద్యోగం పోవడంతో అదీ పోయింది. నా మిత్రుడు విహారి చెప్పిన వాదనే కరెక్టనిపిస్తోంది ఇప్పుడు చూడు నీ కాళ్ళు విరిచేశాడు ఏ సాక్ష్యమూ లేదు. నీ వాళ్ళకు ఏం జరిగిందో తెలీదు. నువ్వెక్కడున్నావో తెలీదు రేపు సాయంత్రం నీకు ఆపరేషన్ జరగబోతూంది. కాళ్ళు రెండూ తీసేస్తారు ..... ఆమె ఆగి నెమ్మదిగా పూర్తి చేసింది ఆ తరువాతది ఎల్లుండి పొద్దున్న అనంతానంతస్వామికి కబురు పంపిస్తాను రామ్‌లాల్ నువ్వు రహస్యాలన్నీ మాకు చెప్పెయ్యదల్చుకున్నావని ..... వెంటనే నీ గురించి వేట ప్రారంభమవుతుంది. చూద్దాం నిన్నెంత మంది పోలీసులు రక్షించగలరో?

ఆమె లేచి తాపీగా అక్కణ్నుంచి వెళ్ళిపోయింది.

*   *   *

రామ్‌లాల్ ఏమయ్యాడు? ..... ఈ సందేహం స్వామి క్యాంప్‌లో దావానలంలా వ్యాపించి అందరినీ కలవర పరుస్తోంది.